

జర్నలిస్టుల సంక్షేమంపై జనవరి 15తర్వాత

# ఉన్నతస్థాయి సమావేశం


కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )
శుక్రవారం 05, జనవరి 2024 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ





## జర్నలిస్టుల సంక్షేమంపై జనవరి 15తర్వాత

# ఉన్నతస్థాయి సమావేశం

- ఐజేయూ, టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి మంత్రిలి పొంగులేటి హామీ

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

జర్నలిస్టుల ఇంటి స్థలాలు, సంక్షేమ చర్యలకు సంబంధించి జనవరి 15తర్వాత ఒకరోజు సంబంధిత ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఐజేయూ, టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం సచివాలయంలోని మంత్రి చాంబర్ లో ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీల నేతృత్వంలో ఐజేయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు కె.రాంనారాయణలతో కూడిన ప్రతినిధి బృందం భేటీ అయ్యి జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి గత ప్రభుత్వాలు ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోలను సేకరించాలని, అలాగే వాటి ద్వారా ఇచ్చిన స్థలాల వివరాలు, స్వాదీనం చేయకుండా ఉన్న స్థలాల వివరాలు, ఇకముందు ఇవ్వడానికి అనువైన స్థలాలను నిర్దిష్టంగా పేర్కొంటూ నివేదికలు పంపించాలని రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రతినిధి బృందానికి మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల విషయమై జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో కూడా గడిచిన రెండు దశాబ్దాలుగా ఇంటి స్థలాలు ఇవ్వనందున జర్నలిస్టులు అధిక సంఖ్యలో ఉన్నారనే విషయాన్ని ప్రతినిధి బృందం మంత్రి దృష్టికి తీసుకెళ్ళింది. వీటితో పాటు చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ విషయాన్ని ఐజేయూ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి ప్రస్థావించగా, ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, ముఖ్యమంత్రితో చర్చించి తప్పని సరిగా పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల నివేశన స్థలాలు, ఇతర సంక్షేమ చర్యలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై ఒక విధానపరమైన ప్రకటన చేస్తామని ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై టీయూడబ్ల్యూజే ఇచ్చిన 3పేజీల వివరణాత్మక వినతి పత్రాన్ని కులంకశంగా చదివి చర్చించిన మంత్రికి ప్రతినిధి బృందం కృత్షతలు తెలిపింది.

## జిల్లాకు సమాచార శాఖ ఏ.డి ఆఫీస్ మంజూరు

- టియుడబ్ల్యూజే (ఐజేయు) నేతల విజ్ఞప్తికి స్పందించిన మంత్రి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- టియుడబ్ల్యూజె (ఐజెయు) హర్షం
- మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు

ఖమ్మం కలెక్టరేట్, కెరటం న్యూస్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా కు సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని మంజూరు చేసింది. రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రతినిధులు గురువారం సాయంత్రం హైదరాబాదులోకలిసిన కలిసిన సందర్భంలో ఈ విషయాన్ని మంత్రి వెల్లడించారు. ఐజెయు జాతీయ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, జాతీయ కార్యదర్శి వై. నరేందర్రెడ్డి, టియుడబ్ల్యూజె రాష్ట్ర నాయకులు విరాక్అలీ, కె.రాంనారాయణ తదితరులు సమాచార శాఖ మంత్రి పొంగులేటిని కలిసిన సందర్భంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రెండు రోజుల క్రితం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని టి యు డబ్ల్యూజే ఐజేయు జిల్లా నేతలు చేసిన విజ్ఞప్తికి స్పందించిన పొంగులేటి పక్షం రోజులో ఏ.డీ కార్యాలయం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చిన మూడు రోజులకే కార్యరూపంలోకి తీసుకొచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఖమ్మం జిల్లా కేంద్రంగా ఏ.డి కార్యాలయం ఉండేది .తెలంగాణ విభజన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటుతో ఖమ్మం ఏ.డి కార్యాలయం సూర్యాపేట జిల్లాకు తరలి వెళ్ళిన విషయం తెలిసిందే.ఏ.డి ఆఫీస్ మంజూరుతో జిల్లాకు అదనంగా రెండు ఏపీఆర్ఓ పోస్టులు, మూడు పబ్లిసిటీ అసిస్టెంట్ పోస్టులు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక టైపిస్టు, ఒక రికార్డు అసిస్టెంట్ పోస్టులు రానున్నాయి. ఖమ్మంకు ఏ.డి కార్యాలయం మంజూరి పట్ల టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మంజిల్లా శాఖ హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలియజేసింది. కృతజ్ఞతలు తెలియజేసిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని కృష్ణమురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, ఖదీర్, టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకు సైదులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. సమాచార శాఖ పురోభివృద్ధికి మరింత సహకారం అందించాలని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) కోరింది.



## విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సామర్థ్యం

# అభివృద్ధి చేయాలి..

### సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనాల ప్రకారం 2031-32 నాటికి పెరగనున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలను పరిగణలోకి తీసుకొని ఆయా వ్యవస్థల సామర్థ్యం పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర విద్యుత్ శాఖపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్కో, జెన్ కో ఇంచార్జ్ సిఎండి సయ్యద్ ముర్తుజా రిజ్వీ, ఇతర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తులో విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు రామగుండం ఎన్టిపిసి ఫేజ్-2 లో 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం ఎన్టిపిసితో సంప్రదింపులు జరపాలని చెప్పారు. సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఆధ్వర్యంలో జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ లో అదనంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్ నిర్మాణం పనులను చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్టిపిసి ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా తొలి విడతలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఎన్టిపిసి నిర్మాణం చేస్తున్నదని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. వచ్చే వేసవిలో రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా కు ఎలాంటి ఇబ్బంది రాకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# కేటీఆర్ తీరు బాధాకరం

- ఓటమితో మతి భ్రమించి మాట్లాడుతున్నారు
- నెల రోజులు కూడా కానీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు
- పదేండ్లు మీరు చేసిన ప్రగతి చూసే ప్రజలు బుద్ధి చెప్పారు
- హామీలు మరిచిపోయే చరిత్ర బీఆర్ఎస్ దే
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్ ప్రతినిధి



కేటీఆర్ తీరు బాధాకరమని ఓటమి తర్వాత మతి భ్రమించి మాట్లాడుతున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అన్నారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్ మాటలు అవివేకంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా నెలరోజులు కూడా కాలేదు అప్పుడే కేటీఆర్ కాంగ్రెస్ వి 420 హామీలను అనడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో గెలిచిన తర్వాత ఆనాడు ప్రతిపక్ష హెూదాలో ఉన్న కాంగ్రెస్ హామీలపై ప్రశ్నిస్తే ఇప్పుడే పుట్టిన బిడ్డ అంటూ కాలయాపన చేశారని గుర్తు చేశారు. ముందస్తు ఎన్నికల్లో భాగంగా 2018లో రెండవ దఫా ఎన్నికల్లో గెలిచి మంత్రివర్గ విస్తరణకే టిఆర్ఎస్ కు నెల రోజులు టైం పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. కేటీఆర్ ప్రజాతీర్పును అంగీకరించుకోని స్థితిలో ఉండి విమర్శలు చేస్తున్నారని హితవు పలికారు. దళిత ముఖ్యమంత్రి, మూడేకరాల భూమి, నిరుద్యోగ భృతి, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేజీ టు పీజీ విద్య హామీల పేరుతో పదేళ్లుగా అధికారంలో ఉండి ఏ ఒక్కటి కూడా నెరవేర్చని బిఆర్ఎస్ (టిఆర్ఎస్) వే అసలైన 420 హామీలని దుయ్యబట్టారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేసిన అవినీతిని, అబద్ధపు హామీలను ప్రజల గ్రహించి కాంగ్రెస్ కు పట్టం కట్టారని కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని వంద రోజుల్లో నెరవేరుస్తామని చెప్పడం జరిగిందని కానీ కేటీఆర్ అత్యుత్సాహంతో సరిగ్గా నెల రోజులు కూడా కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు.

## యువకుడి చేతులు నరికిన గుర్తుతెలియని దుండగులు

మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి

ఎర్రుపాలెం మండలానికి చెందిన బనిగండ్లపాడు నివాసి మల్లే శ్వరం(26) అనే యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు చేతులు నరికి రైతు వేదిక సమీపంలో పడవేశారు. స్థానికులు గమనించి మధిర దవఖాన కు తరలించగా డాక్టర్ల సూచన మేరకు రక్తస్రావం అధికం కావడంతో క్షతగాత్రున్ని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



# భట్టిని కలిసిన మెగాస్టార్ చిరంజీవి



హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్: రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుని గురువారం రాత్రి ప్రజాభవన్‌లో ప్రముఖ సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి ఆయన సతీమణి సురేఖ లు మర్యాద పూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కాశ్మీర్ నుంచి తెప్పించిన శాలువాతో చిరంజీవి సత్కరించారు. చిరంజీవి దంపతు లకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి భట్టి విక్రమార్క గారు సత్కారం చేశారు. ఆయన వెంట కుమారుడు సూర్య విక్రమాదిత్య ఉన్నారు.









# రాబోయే విజయాలను దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాలి

ఖమ్మం, కెరటం న్యూస్ ప్రతినిధి

రాబోయే విజయాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్న ఖమ్మం పార్లమెంట్ సమాయత్త సమావేశంలో ప్రతి నియోజకవర్గం నుండి 100 మంది ముఖ్యులతో హైదరాబాద్ లో జరిగే సమావేశంలో తప్పక హాజరు కావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల కోసం భారత రాష్ట్ర సమితి పూర్తి స్థాయిలో సమయత్తమవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ భవన్ వేదికగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు ముఖ్య నేతలతో సమాయత్త సమావేశం నిర్వహించనున్నారని అన్నారు. ప్రజా స్వామ్యంలో ఎలాంటి పార్టీలైనా గెలుపు ఓటములు చవిచూస్తూనే ఉంటాయి. ఇది ప్రజా స్వామ్యంలో సాధారణమైన విషయం. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు ఒక భాగం మాత్రమే.. ప్రజల తీర్పును గౌరవించవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలు ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో ఆ విధంగానే స్వీకరిస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం మేరకు పని చేయాలని అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన జరుగనున్న సమావేశంలో తప్పక పాల్గొనాలి అని అన్నారు. వేదిక మీద ఉన్న వారిలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, కృష్ణ, భీరెడ్డి నాగచంద్ర రెడ్డి, మద్దినేని వెంకట రమణ, తాళ్లూరి జీవన్ కుమార్, వైస్ ఎంపిపి గుత్తా రవి, నున్నా మాధవ రావు, తాజ్‌ఉద్దీన్, శీలంశెట్టి వీరభద్రం, ఇస్సాక్, షౌకత్ అలీ, మండల అధ్యక్షుడు వీరు నాయక్ తదితరులు ఉన్నారు.

# సావిత్రి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

- **టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా.దుర్గాభవాని**

ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్

ఆదర్శ మహిళ, స్త్రీ జనోద్దరణ కోసం విశేషంగా కృషి చేసిన భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని టియస్ యుటియఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నందు జిల్లా ఉపాధ్యక్షులు షమి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం విశేష కృషి చేశారని, సమాజంలో ఆనాడు అనేక అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ పాఠశాలలు స్థాపించి స్త్రీ విద్యకోసం కృషి చేశారని నేటి తరం మహిళా ఉపాధ్యాయులు వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ అభ్యున్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 30 మంది మహిళా ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించనైనది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు నాయకులు బుర్రి.వెంకన్న, వల్లంకొండ . రాంబాబు, షేక్ రంజాన్, సురేష్, రాందాస్, కె.గీత, జ్యోతి, లక్ష్మీకుమారి, లక్ష్మి, హబీబాబేగం, కస్తూరిబాయి, రమణ, సీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా పలనకు విశేష స్పందన

మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి

మధిర మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డ్‌లో అభయ హస్తం ప్రజాపాలన కార్యక్రమని ఎస్సీ హాస్టల్ నందు వార్డ్ కౌన్సిలర్ ఇక్బాల్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమమును ప్రారంభించిన మధిర మున్సిపల్ చైర్పర్సన్ మొండితోక లత ఈ సందర్బంగా మాట్లాడుతూ మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత ఐదు గ్యారెంటీ పథకాలకి సంబంధించి అర్హులైన పేదల నుండి ఒకే దరఖాస్తు ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది, కావున 2 వ వార్డు ప్రజలు ఈ కార్యక్రమమును సద్వినియోగం చేసుకోగలరని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మీ గారు,మునిసిపల్ కమీషనర్ రమాదేవి గారు,మునిసిపల్ మేనేజర్ రవీందర్ గారు, రాము, ఎర్రగుంట రమేష్ గారు,వార్డ్ ఆఫీసర్స్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

కెరటం న్యూస్, గార్ల ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పళ్ళ నర్సయ్య, లక్ష్మి దంపతుల కుమార్తె సంధ్యారాణి నాగేంద్రబాబు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇల్లందు శాసనసభ్యుడు కోరం కనకయ్య, గార్ల మండల పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఈ కార్యక్రమంలో ఇల్లందు మాజీ మార్కెట్ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ సుందర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కిషన్, మల్లి బాబు షైక్ యాకుబ్ పాషా, గులగట్టు , భూక్యా అశోక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ శ్రీను, రాంసింగ్, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి అండగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆర్థిక సహాయం అందజేత

కెరటం న్యూస్, గార్ల ప్రతినిధి

గార్ల పట్టణంలో శుభకార్యంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కోరం కనకయ్య కు ఇందిరానగర్ కాలనీ చెందిన వల్లపుదాసు జయప్రసాద్ అనారోగ్యం పరిస్థితిని స్థానిక నాయకులు వివరించగా వెంటనే స్పందించిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వడ్లమూడి దుర్గ ప్రసాద్ ఇల్లందు మాజీ మార్కెట్ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు గారు యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు షైక్ యాకుబ్ పాషా గులగట్టు లెనిన్, వేషమల్ల రాజశేఖర్, శ్రీకాంత్, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు పిల్లలమర్రి వీరస్వామి, ఆకారపు సూర్య తదితరులున్నారు.



## ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన మునిసిపల్ చైర్మన్

మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి

మధిర మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డ్‌లో అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమని ఎర్రగుంట లక్ష్మి రమేష్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమమును ప్రారంభించిన మధిర మున్సిపల్ చైర్పర్సన్ మొండితోక లత ఈ సందర్బంగా మాట్లాడుతూ.. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత ఐదు గ్యారెంటీ పథకాలకి సంబంధించి అర్హులైన పేదల నుండి ఒకే దరఖాస్తు ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది, కావున 2 1వ వార్డు ప్రజలు ఈ కార్యక్రమమును సద్వినియోగం చేసుకోగలరని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మీ రమేష్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగా హనుమంతరావు రంగా శ్రీనివాసరావు నాగరాజు ముచ్చర్ల సురేష్ పాశం రామనాథం, మునిసిపల్ కమీషనర్ రమాదేవి, మునిసిపల్ మేనేజర్ రవీందర్, రాము, ఎర్రగుంట రమేష్ , వార్డ్ ఆఫీసర్స్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేగులచెలకలో ప్రజాపాలనకు స్పందన

రఘునాథ పాలెం, కెరటం న్యూస్ ప్రతినిధి

రఘునాథపాలెం మండలం రేగులచిలక గ్రామంలో ప్రజా పాలన 6 గ్యారంటీల పథకానికి గ్రామ సభ జరిగింది. మండల ఎమ్మార్వో ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అప్లికేషన్లు తీసుకోవడం జరిగినది. వివిధ పథకాలకు అప్లై చేసుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, కాంగ్రెస్ నాయకులు ఎండపల్లి సత్యం, ఎండపల్లి జగన్ మోహన్ రావు, భూషయ్య, తుమ్మలపల్లి సత్యం, చలమల్ల ముత్తయ్య, ఎంపీటీసీ, ఎండపల్లి వెంకటేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమంగా ఆక్రమించిన పట్టా భూమిని ఇప్పించండి

- చంపుతానని బెదిరిస్తున్న మాటేటి నాగేశ్వరావు, యర్రా గోపీలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విలేకరుల సమావేశంలో బాధితుడు పద్మం వెంకటేశ్వర్లు

ఖమ్మం, జనవరి 4, కెరటం న్యూస్

పట్టా పాస్ బుక్ కలిగిన ఎకరం 13 కుంటల భూమిలో 9 కుంటల భూమిని అక్రమంగా ఆక్రమించుకొని పెద్దల సమక్షంలో అడిగితే చంపుతానని బెదిరిస్తున్న మాటేటి నాగేశ్వరరావు, యర్రా గోపీలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఖమ్మం శ్రీనివాసనగర్ కు చెందిన పద్మం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఖమ్మం అర్బన్ మండలం, దంస్లాపురం రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ : 32/అ లో ఎకరం భూమి, సర్వే నెంబర్ : 32/ఇ/1లో 13కుంటలు భూమి మొత్తం కలిపి ఎకరం



13కుంటల వ్యవసాయ భూమిని యర్రా శైలజ, భర్త యర్రా గోపి వద్ద నుండి నా భార్య పద్మం రమాదేవి పేరుమీద కొనుగోలు చేసి 6526/2015లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని తెలిపాడు. భూమికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు నా వద్దనే ఉన్నాయన్నారు. నా చిన్న కుమార్తె వివాహము నిమిత్తం సదురు భూమిని విక్రయించదలసి సర్వే చేయించగా సదరు భూమి ఎకరం 13 కుంటలకు గానూ ఎకరం 4 కుంటల భూమి మాత్రమే ఉన్నదని సర్వేయర్ రిపోర్టు ఇచ్చాడన్నాడు. మిగతా 9 కుంటల భూమి కార్పొరేటర్ మాటేటి అరుణ భర్త, మాటేటి నాగేశ్వరరావు ఆక్రమణంలో ఉందని తెలిపారు. పెద్ద మనుషుల సమక్షంలో అడిగితే యర్రా గోపి ప్రోద్భలంతో మాటేటి నాగేశ్వరరావు చంపుతానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఇట్టి విషయమై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ లకు కూడా ఫిర్యాదు చేశానని, సదరు భూపత్రాలు పరిశీలించి, సర్వే నిర్వహించి, మా భూమిని మాకు అప్పగించి, చంపుతానని బెదిరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు పద్మం వెంకటేశ్వర్లు వేడుకున్నాడు.



## జనవరి 6న భట్టికి పౌర సన్మానం

మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి

రేపు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మధిర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధిర పట్టణంలో రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్, శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి పౌర సన్మాన కార్యక్రమం కలదు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, ముఖ్య నాయకులు, మహిళలు, యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొని పౌర సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు. మాజీ మార్కెట్ చైర్మన్ రంగ హనుమంతరావు మధిర మున్సిపల్ కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వర్లు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్ రెడ్డి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు బీసీ సెల్ మండల అధ్యక్షులు చిలివేరు బుచ్చి రామయ్య మండల నాయకులు పాటిబండ్ల సత్యంబాబు పారుపల్లి విజయ్ కుమార్ ఐలూరు సత్యనారాయణ రెడ్డి. చెరుకూరి నాగార్జున పత్తేపరపు సంగయ్య మొండితోక సుధాకర్ యన్నం కోటేశ్వరరావు కరివేద రాంబాబు దుంప వెంకటేశ్వర రెడ్డి ఐఎన్టియుసి మండల అధ్యక్షులు కోరంపల్లి చంటి పట్టణ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు ఎస్ కే బాజీ. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దల లాలయ్య పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బిట్రా ఉద్దండయ్య . డివిజన్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు మాగం ప్రసాద్ అంబర్పేట రామారావు బండారు నరసింహారావు ఆదిమూలం శ్రీనివాస్ బుల్లెదు రాజేందర్ మైలవరం చక్రి. మోదుగు బాబు. కటూకూరి శ్యామారావు కోన నరసింహారావు. తదితరులు పాల్గొన్నారు.

## భూకబ్జా ఆరోపణలు సరైనవి కావు: గోపి

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

శ్రీనివాస్ నగర్ ప్రాంతం లో తనపై వచ్చిన భూకబ్జా ఆరోపణలు సరైనవి కావని సిపిఎం 31వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర గోపి అన్నారు. తన పై మరియు మటేటి నాగేశ్వరావుపై వచ్చిన భూ కబ్జా ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. స్వార్థం కోసమే తమను బధనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రమేయం లేకున్న రాజకీయా ప్రమేయం ఉందనీ అనడం సరైనది కాదని అన్నారు. తన అవసరం కోసం తీసుకున్న అప్పుకు ఇచ్చిన భూమి ఇస్తే, ఆక్రమణ ఆరోపణ చేయడం సరైనది కాదని అన్నారు. తమ ఎవరిని బెదిరించలేదని ఈ భూమిని కబ్జా చేయలేదని స్పష్టం చేశారు. పద్మం వెంకటేశ్వర్లు అనే వ్యక్తీ తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకుని తన సమస్యలకు రాజకీయ రంగు పూయడం సరికాదని అన్నారు. నా పై వచ్చిన ఆరోపణలకు దేనికైనా సిద్ధం అన్నారు. ఈ ఆరోపణలు పై కమిటీ వేసి నిజ నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.



# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తాం

■ జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్





**ఖమ్మం, జనవరి 4:**

ప్రజా పాలన కార్యక్రమం ద్వారా వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్దేశిత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఖమ్మం నగరంలో 46వ డివిజన్ జూబ్లీ క్లబ్, ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్, ఏదులాపురం లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వ గ్యారంటీలతో పాటు, ఇతర సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా యంత్రాంగం పరిధిలో ఉన్న సమస్యలు అన్నిటినీ పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్యారంటీ పథకాలతో పాటు ఏ ఇతర అంశంపై ప్రజలు అధికంగా దరఖాస్తు సమర్పిస్తున్నారనే అంశాన్ని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల కోసం అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలుసుకున్న కలెక్టర్, రేషన్ కార్డుల నిమిత్తం వచ్చే దరఖాస్తులనూ స్వీకరించాలన్నారు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చి సమర్పించే ప్రతి దరఖాస్తును తీసుకోవాలని, దరఖాస్తులను తిరస్కరించడానికి వీలు లేదని ఆయన తెలిపారు. దరఖాస్తులను బల్క్ గా తీసుకోకూడదని ఆయన అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ ల ద్వారా సందేహాల నివృత్తి చేసుకోవాలన్నారు. దరఖాస్తు పూరించడంపై ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, జెడ్పి సిఇఓ అప్పారావు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరామ్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి, ఖమ్మం రూరల్ ఎంపిడివో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం, జనవరి 4:**

ప్రజాపాలన ఏడవ రోజు (05-01-2024) శుక్రవారం జిల్లాలో 21 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 96 ప్రదేశాలలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మండల/గ్రామ/మున్సిపాలిటీలలో గ్రామ సభల నిర్వహణ జరుగుతుందన్నారు. ఉదయం షెడ్యూల్ లో 8 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు చింతకాని మండలం నాగులవంచ, రామక్రిష్ణాపురం, ఏన్కూరు మండలం ఏన్కూరు, కల్లూరు మండలం చంద్రుపట్ల, కల్లూరు, చెన్నూరు, కామేపల్లి మండలం కామేపల్లి, జగన్నాధతండా, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా, ఏదులాపురం, కొణిజర్ల మండలం కొణిజర్ల, కొత్తకాచారం, కూసుమంచి మండలం మునిగేపల్లి, గట్టుసింగారం, మధిర మండలం వంగవీడు, మధిర మున్సిపాలిటీ 22 వ వార్డు, 9 వ వార్డు, ముదిగొండ మండలం చిరుమర్రి, యడవల్లి లక్ష్మీపురం, నేలకొండపల్లి మండలం చెరువుమాదారం, నేలకొండపల్లి, పెనుబల్లి మండలం లంకపల్లి, తెలగవరం (కెడబ్లూ), రఘునాథపాలెం మండలం సూర్యతండా, రాంక్యాతండా, సత్తుపల్లి మున్సిపాలిటీ 20 వ వార్డు, సత్తుపల్లి మండలం తుంబూరు, నారాయణపురం, సింగరేణి మండలం కొత్తకమలాపురం, గేటురేలకాయలపల్లి, తల్లాడ మండలం రామానుజవరం, కుర్నవల్లి, తిరుమలాయపాలెం మండలం లక్ష్మీదేవిపల్లి, తెట్టెలపాడు, వేంసూరు మండలం వేంసూరు, మర్లపాడు, వైరా మున్సిపాలిటీ 17 వ వార్డు, 13 వ వార్డు, ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల, భీమవరం గ్రామాల్లో, మధ్యాహ్నం షెడ్యూల్ లో 2.00 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు చింతకాని మండలం నాగులవంచ, ఏన్కూరు మండలం ఏన్కూరు, కల్లూరు మండలం చంద్రుపట్ల, కల్లూరు, చెన్నూరు, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా, పల్లెగూడెం, కొణిజర్ల మండలం కొణిజర్ల, తనికెళ్ల, కూసుమంచి మండలం నేలపట్ల, భగవత్‌వీడు, మధిర మండలం ఆత్కూరు, రాయపట్నం, మధిర మున్సిపాలిటీ 8వ వార్డు, ముదిగొండ మండలం పెద్దమండవ, మల్లారం, నేలకొండపల్లి మండలం చెరువుమాదారం, నేలకొండపల్లి, పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి, చింతగూడెం, రఘునాథపాలెం మండలం జింకలతండా, శివాయిగూడెం, సత్తుపల్లి మండలం రామనగరం, కిష్టాపురం, సింగరేణి మండలం పాతకమలాపురం, జ్యెత్‌రాంతండా, తల్లాడ మండలం లక్ష్మీపురం, కుర్నవల్లి, తిరుమలాయాపాలెం మండలం హస్నాబాద్ కేశవాపురం, వేంసూరు మండలం వేంసూరు, భరణిపాడు, వైరా మున్సిపాలిటీ 8 వ వార్డు, 14 వ వార్డు, ఎర్రుపాలెం మండలం జమలాపురం, తక్కెళ్లపాడు గ్రామాల్లో, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం 51 వ డివిజన్ ఎన్ఎస్‌పి క్వార్టర్స్, బుర్హాన్‌పురం, 52 వ డివిజన్ లెనిన్‌నగర్, బాలాజినగర్, 53 వ డివిజన్ సహకారనగర్, ఎన్ఎస్‌పిక్యాంపు, 54 వ డివిజన్ విడిఓస్ కాలనీ, 55 వ డివిజన్ విడిఓస్ కాలనీ, వేణుగోపాల్ నగర్, 56 వ డివిజన్ విజయనగర్ కాలనీ, 57వ డివిజన్ వికలాంగుల కాలనీ, రమణాగుట్ట, 58వ డివిజన్ బిసి కాలనీ, 59వ డివిజన్ దానవాయిగూడెం, మధ్యాహ్నం 41 వ డివిజన్ సీక్వెల్ రోడ్, చెరువుబజార్, 51 వ డివిజన్ ఎన్ఎస్‌పి క్వార్టర్స్, బురహాన్‌పురం, 52 వ డివిజన్ లెనిన్‌నగర్, బాలాజీనగర్, 53 వ డివిజన్ సహకారనగర్, ఎన్ఎస్‌పి క్యాంపు, 54 వ డివిజన్ విడిఓస్ కాలనీ, 55 వ డివిజన్ ద్వారకానగర్, వేణుగోపాల్ నగర్%--%1, 56 వ డివిజన్ విజయనగర్ కాలనీ, 57 వ డివిజన్ వికలాంగుల కాలనీ, 58 వ డివిజన్ బిసి కాలనీ, రమణాగుట్ట, 59 వ డివిజన్ దానవాయిగూడెం ప్రాంతాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



## పాఠశాల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ వీపీ.గౌతమ్**

**ఖమ్మం, జనవరి 4:**

పాఠశాల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. గురువారం కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ చేశారు. మన ఊరు-మన బడి కార్యక్రమం క్రింద చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలించారు. టాయిలెట్ బ్లాకుల మిగులు పనులు వెంటనే పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలన్నారు. ఆర్ఎంఎస్ఏ క్రింద చేపట్టిన డైనింగ్ హాల్, తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణం పూర్తి కానందుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. మిగులు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జెడ్పి సిఇఓ అప్పారావు, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. శ్రీరామ్, ఎంపిడివో రవీందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివ కుమారి, అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించిన తహసిల్దార్ వెంకటేశ్వర్లు

**మధిర, కెరటం న్యూస్**

మధిర మున్సిపాలిటీ పరిధిలోని18వ వార్డ్ లో అయ్యప్ప స్వామి గుడిలో కౌన్సిలర్ అరిగే రజిని ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమమును ప్రారంభించిన మధిర తహసిల్దార్ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత ఐదు గ్యారెంటీ పథకాలకి సంబంధించి అర్హులైన పేదల నుండి ఒకే దరఖాస్తు ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది, కావున 18 వ వార్డు ప్రజలు ఈ కార్యక్రమమును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



## పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులైన చేతివృత్తుదారులు ఉపయోగించుకోవాలి

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవికుమార్**

**నేలకొండపల్లి:** పిఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులైన చేతి వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం నేలకొండపల్లిలోని పిఎస్ఆర్ సెంటర్లో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధిదారులతో ఆన్లైన్ చ్టేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17 విశ్వకర్మ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. చేతివృత్తుదారులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఈ పథకాన్ని చేపట్టారన్నారు. చేతి వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు చేయూతనివ్వాలని, హస్తకళాదారులకు అవసరమైన ఆర్థిక వనరులు కల్పించడం జరుగుతుందన్నారు. వారి నైపుణ్యానికి సానబెట్టి వారి ఉత్పత్తులకు తగిన మార్కెట్ సదుపాయాలు కల్పించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తారన్నారు. చేతి వృత్తిదారుల ఆదాయాన్ని పెంచాలని వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఎటువంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా 3 లక్షల రూపాయల వరకు 5 శాతం తక్కువ వడ్డీ తో వారికి రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి పనిముట్ల కోసం 15 వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తారని ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ఈ పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాన్ని 18 రకాల చేతివృత్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఆన్లైన్లో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఈ పథకం వర్తిస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కోటి హనుమంతరావు, మండల ప్రధాన కార్యదర్శిలు సూరేపల్లి జ్ఞానరత్నం, పాగర్తి సుధాకర్, కిసాన్ మోర్చ మండల అ్యక్షుడు మన్నే రాధాకృష్ణ, మైనార్టీ మండల అధ్యక్షుడు మొహిద్దీన్, బాజా రామకృష్ణ, కందికొండ రమణ, కంద్రబోయిన గోపి, అల్లు కృష్ణారావు, వేణుబబు, తంగెళ్ళ గణేష్ లు పాల్గొన్నారు.